## ప్రశ్న:

## "సంఘానికి నమూనా ఏమైనా ఉందా?"

## జవాబు:

క్రొత్త నిబంధన పత్రికలు "ప్రేమ లేఖల సేకరింపు అని, ప్రేమ లేఖల్లో నియమాలు ఏమీ ఉండవని" చెప్పి పండితులైన సువార్తికులు అటు యౌవనస్థులను, యిటు వృద్ధులను తప్పు దారిని త్రొక్కించారు. నిజంగా, ప్రేమ ఆధారమైయుండి, క్రొత్త నిబంధన అంతటిలో అది విస్తరించియున్నది వాస్తవమేగాని, ఒక నిర్దిష్టమైన "నియమం" ప్రకారం నడుచుకునే వారికి మాత్రమే దీవెనలు ప్రకటించబడ్డాయి (Gk.: *kanon*; గలతీ. 6:16).

"ప్రేమ లేఖల్లో చట్టాలు లేవు" అని కొందరు అన్నా, క్రొత్త నిబంధన ప్రేమ లేఖలైతే "క్రీస్తు నియమాన్ని" కలిగియున్నాయి (గలతీ. 6:2).

"ప్రేమ కలిగియుందాం, కాని సిద్ధాంతం వద్దు" అని కొందరంటారు. అయినా, దైవ ప్రేరేపితుడైన అపొస్తలుడు, ఒక యువకుడైన సువార్తికునికి వ్రాస్తూ, "సిద్ధాంతాని"కి "శ్రద్ధ యివ్వవలసిందిగాను," "నిన్ను గూర్చియు నీ బోధను (డాక్ట్రిన్) గూర్చియు జాగ్రత్తగా ఉండమనియు, అలాగుచేసి, తనను తన బోధను వినువారిని రక్షించుకోమనియు హెచ్చరించాడు" (1 తిమోతి 4:13, 16; KJV).

నమూనా అనే ఉద్దేశాన్ని కొందరు అపహాస్యం చేస్తారు. అయినా, దుస్తులను తయారు చేయడంలో మిషన్ కుట్టే మనిషి తనకు నమూనా సహాయంగా ఉన్నట్టు కనుగొంటాడు. బడి పిల్లవాడు, తన టీచర్ యిచ్చిన నమూనాను అనుసరించి అక్షరాభ్యాసం చేస్తాడు. "తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు" క్రీస్తు ప్రభువు క్రైస్తవులకు "మాదిరిని" (నమూనాను) యిచ్చి వెళ్లారు (1 పేతురు 2:21).

### పాత నిబంధనలో దేవుడు ప్రసాదించిన నమూనాలు

పాత కాలపు సువార్తికులు కాదు, నవీన కాలపు సువార్తికులు ఖండించే, "*pattern theology*" ని దేవుడే ప్రారంభించాడు. హేబెలు కాలానికి దేవుడు ఒక ఆరాధన విధానాన్ని (నమూనాను) యిచ్చాడు. హేబెలు విశ్వాసంవలన తన బలిని అర్పించినందున (హెబ్రీ. 11:4), మరియు విశ్వాసమనేది వినుటవలన వచ్చేది గనుక (రోమా 10:17), దేవుడు వృక్ష సంబంధమైన అర్పణనుగాక, జంతు బలులకు సంబంధించిన దానిని నిర్దిష్టంగా తెలిపినట్టు స్పష్టమౌతుంది (ఆది. 4:4).

ఆ విధంగా జంతు, రక్త సంబంధమైన బలియర్పణ నమూనా ఆరంభమయ్యింది: ఈ నమూనాను–నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు కొనసాగించారు (ఆది.

8:20; 12:7, 8; 26:23-25; 31:54). ఇశ్రాయేలీయులతో చేయబడిన ధర్మశాస్త్ర నిబంధనలో, జంతు బలులు అత్యవసరములై ఉన్నాయి (లేవీ. 16:1-34). "తన స్వరక్తముతో" "లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అగునట్లు ప్రభువైన యేసుకు మానవ "దేహాన్ని" అమర్చినప్పుడు ఈ నమూనా శిఖరాగ్రానికి చేరుకొంది (యోహాను 1:29; హెబ్రీ. 9:12; 10:5).

ఓడను నిర్మించునట్లు నోవహుకు ప్రత్యేకించి నమూనాను యిచ్చినది దేవుడే: ఉపయోగించవలసిన కొయ్యి మొదలుకొని, దాని కొలతలు, అంతస్థులు, కిటికీ, వగైరాలను దేవుడే అతనికిచ్చాడు. ఆ నమూనాను పూర్ణంగా అనుసరించినందులకే నోవహు గుర్తింప బడ్డాడు, పొగడబడ్డాడు (ఆది. 6:14-16, 22). మోషే గుడారమును అమర్చబోయి నప్పుడు, "నమూనా" లేకుండా చేయలేదు (*tabhnith* అనే హెబ్రీ మాటకు, *tupos* అనేది గ్రీకు); కొండమీద దేవునిచే ఆ నమూనా యియ్యబడింది (నిర్గమ. 25:9, 40; 26:30; హెబ్రీ. 8:5).

అలాగే, దేవుడు "ఆత్మమూలముగా" దేవాలయాన్ని గూర్చిన నమూనాను దావీదున కిచ్చాడు (1 దినవృ. 28:12). "ఇవన్నియు అప్పగించి – యెహోవా హస్తము నామీదికి వచ్చి మచ్చుల పనియంతయు వ్రాత మూలముగా నాకు నేర్పెను అని సొలొమోనుతో" దావీదు చెప్పాడు (1 దినవృ. 28:19).

దావీదు తానే దేవాలయము కట్ట అనుమతింపబడలేదుగాని, "తన సామర్థ్యమంతటితో" దాని నిమిత్తము "సామాగ్రిని" సమకూర్చినట్టు తెలిపాడు (1 దినవృ. 29:2). తన కుమారుడైన సొలొమోనుకు ఆ నమూనాను అప్పగింపక ముందు, "మచ్చు ప్రకారము చెక్కుడు చెక్కించాడు" (1 దినవృ. 28:11, 12; 1 రాజులు 6:7). ఆ నమూనాను (మచ్చును) అనుసరించడంలో సొలొమోను ఎంత శ్రద్ధ వహించాడంటే, "మందిరము కట్టు స్థలమున సుత్తె, గొడ్డలి మొదలైన యినుప పనిముట్ల ధ్వని యెంత మాత్రమును వినబడలేదు" (1 రాజులు 6:7).

## క్రొత్త నిబంధనలో దేవుడు ప్రసాదించిన నమూనా

తన ప్రజలు అనుకరించినట్లు దేవుడు ఎల్లవేళల నమూనాలను యిస్తాడు. సొలొమోను దేవాలయానికి ఆయన శిల్పియైయున్నట్టు, "సొలొమోను కంటే గొప్పవాడు" కట్టే దేవాలయానికి గూడా ఆయనే శిల్పియైయున్నాడు (మత్తయి 12:42). భౌతికమైన కట్టడం, అంటే చర్చ్ బిల్డింగ్ కట్టుదునని ప్రభువైన యేసు ప్రకటించలేదు, కాని, "మీరు దేవుని ఆలయమై యున్నారని" ఏ జనులను గూర్చి తెలియజేయబడిందో ఆ దేవుని మందిరాన్ని ఆయన "కట్టుదునని" చెప్పారు (1 కొరింథీ. 3:9). తత్ ఫలితంగా, ప్రభువు "వెలగల రాళ్లతోగాని," "చలువ రాళ్లతోగాని," "దేవదారు మ్రానులతోగాని" (1 రాజులు 5:17; 6:10) కాక, "సజీవమైన రాళ్లతో" ఆ మందిరాన్ని నిర్మించుతున్నారు (1 పేతురు 2:5). "ప్రేమ" అనే అడుసు "పరిపూర్ణమైన అనుబంధమైయుంటుంది" (కొలస్సీ. 3:14).

అది ఎలాటి "భవనమైయుంటుంది!" "నేను వారిలో నివసించి సంచరింతును … అని దేవుడు తెలియజేసినట్టు, క్రైస్తవులందరు ఏకమై కలసికట్టుగా, 'మేము దేవుని ఆలయమై

యున్నాము' " అని చెప్పుకొనే ఆధిక్యతగలవారై యున్నారు (2 కొరింథీ. 6:16; ఎఫెసీ. 2:20–22 చూడు). "దేవుని ఆలయము పరిశుద్ధమైయున్నది; మీరు ఆ  ఆలయమై యున్నారు" అని పౌలు క్రైస్తవులకు వ్రాశాడు (1 కొరింథీ. 3:17).

ఆశ్చర్యాన్ని గొలిపేలా, క్రైస్తవులు కలిసికట్టుగానే దేవుని ఆలయమైయుండనక్కరలేదు; ఏకంగా కూడా, అంటే వ్యక్తిగతంగా కూడా వారు దేవుని ఆలయమే: క్రైస్తవుని భౌతిక కాయము "పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నది" (1 కొరింథీ. 6:19).

ఆశ్చర్యాన్ని గొలిపే ఈ భవనానికి బ్లూప్రింట్ లేదా? హేబెలు యొక్క బలియర్పణకు, నోవహు యొక్క ఓడకు, మోషే అమర్చబోయిన గుడారానికి, సొలొమోను దేవాలయానికి నమూనాలు ఉన్నట్టే, దేవుని ఆత్మసంబంధమైన మందిరమునకు ఉన్నాయి; దానిని సాధారణంగా "సంఘమని" పిలుస్తారు. ఆ ప్రత్యేక వివరణలు పరలోకమునుండి క్రీస్తు యొక్క అపొస్తలులకు పంపబడ్డాయి. క్రైస్తవ్యం యొక్క "ప్రారంభాన్ని" ఎదురు చూచిన ప్రభువు (క్రీ.శ. 30, అపొ. 2:1–47; 11:15), సంఘం కొరకు తండ్రి ఏర్పరచిన నమూనాను గూర్చి ఆ పన్నిద్దరికి ప్రకటించారు: "భూమిమీద మీరు దేనిని బంధించుదురో పరలోకమందు అది బంధించబడి యుంటుంది (Gk.: *estai dedemena*); భూలోకమందు మీరు దేనిని విప్పుదురో పరలోకమందు అది విప్పబడియుంటుందని (Gk.: *estai lelumena*) నేను మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" ప్రభువైన యేసు వారికి తెలియ జేశారు (మత్తయి 18:18).

అపొస్తలులు దేనినైనను చెప్పక ముందు లేక వ్రాయక ముందు, వారు ఏమి చెప్పుతారో, వ్రాస్తారో దానిని పరలోకమందున్న తండ్రియైన దేవుడు పరిశుద్ధాత్మకు తెలిపి, యెరూషలేములో వేచియున్న అపొస్తలుల మీదికి పెంతెకొస్తు రోజున పంప సిద్ధపడి యున్నాడు (యోహాను 14:26; అపొ. 1:8; 2:1–4). పరిశుద్ధాత్మ సహితం "తనంతట తాను ఏమియు బోధింపక," పరలోకమందున్న తండ్రి తనకు ఏమి చెప్ప నాజ్ఞాపించాడో వాటినే అపొస్తలులకు "బోధించి," వారిని "సర్వసత్యంలోనికి" నడిపించాలి (యోహాను 16:13).

"ప్రపంచ పునర్జననమందు" (పునః స్థితి స్థాపనమందు), అపొస్తలులు క్రీస్తుయొక్క "రాయబారులై" యుండి "పండ్రెండు సింహాసనములమీద" ఆసీనులై యుంటారు (మత్తయి 19:28). "యుగసమాప్తివరకు పరలోకమునుండి వారు అధికారము పొందినవారై" యుంటారు (మత్తయి 18:18; 28:20; 2 కొరింథీ. 5:20; 1 థెస్స. 2:6 చూడు). క్రీ.శ. 30 పెంతెకొస్తునుండి – క్రీస్తు రెండవ రాకడవరకు – ఉన్న ఒకే ఒక మార్గమేమంటే "సత్య స్వరూపమైన ఆత్మ యేదో, భ్రమపరచు ఆత్మ యేదో" (1 యోహాను 4:6) వ్యత్యాస్నాన్ని గుర్తించి, "అపొస్తలుల బోధవైపుకు" (అపొ. 2:42) మరలడమే. భూమిమీద అపొస్తలుల బోధను కనుగొనే ఒకే చోటు క్రొత్త నిబంధన యొక్క 27 పుస్తకాలు. తండ్రియైన దేవుని చిత్తమును, ఆయన జ్ఞానమునుబట్టి, క్రొత్త నిబంధన సంపూర్ణమైనది, మార్పులేనిది, ఆఖరిది (2 తిమోతి 3:17; 2 పేతురు 1:3; గలతీ. 1:8, 9; యూదా 3).

## దేవునిచే అనుగ్రహింపబడిన నమూనాలు నిరాకరించబడ్డాయి

మొదటి శతాబ్దపు సంఘాన్ని పునరుద్ధరించడానికి గాను క్రొత్త నిబంధనకు వెళ్లడం అనే ఉద్దేశాన్ని కొందరు ఆక్షేపిస్తారు. "ఏ సంఘాన్ని నీవు పునరుద్ధరించబోతావ్? సువార్త చేసే ఆసక్తిలేని యెరూషలేమునా? లేక బహిరంగమైన జారత్వాన్ని కలిగియుండి, సంఘ ఆరాధనలలో ప్రభురాత్రి భోజన సమయాల్లోను త్రాగుబోతుతనాన్ని ప్రదర్శించిన కొరింథు సంఘాన్నా?"

మొదటి శతాబ్దంలోని ప్రతి స్థానిక సంఘంలోను ఏది అంగీకరించబడిందో, ఏది అంగీకరించబడలేదో దానిని దేవుడు క్రొత్త నిబంధనలో స్పష్టంగా తెలియజేశాడు. అది మంచి, చెడ్డల మాదిరులను మనకు తెలుపుతుంది, మరియు సామాన్య జనులు సహితము "మేలు కీడులను వివేచించు"నట్టుగా అది వ్రాయబడియుంది (హెబ్రీ. 5:14).

ఆరంభమునుండి నరులు నమూనాను అనుసరించువారుగా దేవుడు సంకల్పించినా, కయీను మొదలుకొని నమూనాను నిరాకరించేవారు కన్పిస్తునే ఉన్నారు (ఆది. 4:5-7). మానవ గర్వము మరలా, మరలా, పరలోకపు ఉత్తరువును తిరస్కారంతో చూస్తూ, "తన దృష్టియెదుట సరియైన దానిని" జరిగించేలా చేస్తుంది (న్యాయాధి. 21:25). "నరమాత్రుడు తన మార్గాన్ని సరియైనదని" స్థాపించుకోగల సామర్థ్యం తనలో లేదని యిర్మీయా ప్రసంగించాడు (యిర్మీయా 10:23). "అన్ని విషయాలకు మానవుడే కొలబద్ధ"[1] అని మానవ అహంకారం వాదిస్తుంది.

"మీకు మీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దు" అనే అపొస్తలుల హెచ్చరిక సాధారణంగానే అలక్ష్యం చేయబడుతోంది (రోమా 12:16). "ఆస్తికత్వం యొక్క కాలం గడిచి పోయింది"[2]; "ఏ దేవుడూ మనలను కాపాడలేదు; మనలను మనమే రక్షించుకోవాలి"[3] అని మానవతా వాదులు వ్రాసేలా మనిషి యొక్క సొంత గ్రహింపు వానిని నడిపించింది.

దేవుడున్నాడని నమ్మే కొందరు, క్రీస్తును నిరాకరిస్తారు. "యేసుద్వారా మాత్రమే రక్షణ సాధ్యమౌతుంది" అనడం "స్వనీతియని" కొందరు అనసాగారు.

మరికొందరైతే, దేవుడున్నాడనియు, రక్షణ క్రీస్తుద్వారా మాత్రమేననియు నమ్ముతున్నట్టు చెప్పుకొంటున్నా, సువార్తకు లోబడే నమూనాను మాత్రం వారు పరిత్యజించుతారు (2 థెస్స. 1:7-9).[4] "ముంచడం పొందక పోయినా, యథార్థవంతులు నిత్య రక్షణ నొందుతారని నేను ఒప్పింపబడ్డానని" సువార్తికుడని చెప్పుకొనే ఒక వ్యక్తి వ్రాసాడు.

ఇంకా యితరులు, నమూనాలన్నిటిని నిరాకరిస్తూ, "ఎవరూ నశించబోయేది లేదు" అని నమ్ముతారు. ఎవరిని నరకానికి పంపలేనంత మంచివాడు, ప్రేమ మూర్తియని వారు దేవుని గూర్చి తలంచుతూ, తమ సొంత ఆత్మలనే అపాయకరమైన స్థితిలో నిలుపు కొంటున్నారు.

"అవునుగాని ఓ మనుష్యుడా, దేవునికి ఎదురు చెప్పుటకు నీవెవడవు?" (రోమా 9:20a).

## ముగింపు

నేడు మనకొరకు దేవుడు ఒక నమూనాను ప్రసాదించాడు. తన టీచర్ యొక్క గైడ్‌లైన్స్‌ను విస్మరించి (అలక్ష్యం చేసి) అర్థంలేని పిచ్చి గీతలు గీచే పసి బిడ్డలా ఉండకుండ జాగ్రత్త పడదాం. అంతేగాక, నమూనాను పాటించేవారమై యుండాలని మనలను దేవుడు కోరినట్టు ఉందాం. ఆయన దివ్యమైన ఉద్దేశమేమంటే, ఎవడూ నశించిపోకుండా, అందరు మారుమనస్సు పొందాలనేదే (2 పేతురు 3:9).

---

సూచనలు

[1]ఈ ప్రతిపాదన క్రీ.పూ. 5వ శతాబ్దపు గ్రీకు తత్వ శాస్త్రజ్ఞునికి ఆరోపించబడింది. [2]"Humanist Manifesto I," *The New Humanist* (May/June 1933); reprinted in Paul Kurtz, ed., *Humanist Manifestos I and II* (Buffalo, N.Y.: Prometheus Books, 1973), 8. [3]"Humanist Manifesto II," *The Humanist* (September/October 1973); reprinted in Paul Kurtz, ed., *Humanist Manifestos I and II* (Buffalo, N.Y.: Prometheus Books, 1973), 16. [4]"ఏ ఉపదేశ క్రమమునకు" అనే దాని వివరణతో పాటు రోమా 6:3, 4; రోమా 6:17లను చదువు.

### సంఘము

"సంఘమనేది ఎన్నడు స్థలం కాదు, గాని అది ఎల్లప్పుడును ప్రజలే; అది ఎన్నడు గొర్రెల దొడ్డి కాదు, గాని ఎల్లప్పుడును మందయే; అది ఎన్నడు ఒక పవిత్రమైన బిల్డింగ్ కాదు, గాని అది ఎల్లప్పుడును విశ్వసించిన వారి సమాజమే. చర్చ్ (సంఘము) అనేది ప్రార్థించే నీవు, కాని నీవు ప్రార్థించే చోటు కాదు. దూది లేక పట్టు బట్టలు నీవు ఎలా కావో, అలాగే యిటుకలు, లేక చలువ రాళ్ల కట్టడము చర్చ్ (సంఘం) కాదు. ఈ లోకంలో మనుష్యుడు తప్ప పవిత్రమైనదేదీ లేదు, మానవ ఆత్మ తప్ప దేవుని నివాస స్థానమేదీ లేదు."

సేకరణ